క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆరిలోవ: విమ్స్ సబ్ స్టేషన్‌కు సంబంధించిన కైలాసగిరి ఫీడర్ పరిధిలో ఈ నెల 21న మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక, బి.ఎస్.ఆర్.నగర్, తోటగరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

పిల్లలకు మెరుగైన పునాది అవసరం



మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ పీవో చంద్రశేఖరరావు

ఆరిలోవ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు విద్యపై మెరుగైన పునాది అవసరమని సర్వశిక్ష అభియాన్ పీవో చంద్రశేఖరరావు అన్నారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల జ్ఞాన జ్యోతి పేరుతో శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ శిక్షణ మంగళవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకు విద్యను బలోపేతం చేయడానికి ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం 3 నుంచి 6 ఏళ్ల పిల్లలకు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎఈవోలు రవీంద్రబాబు, అనురాధ, ఎంఆర్‌పీలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అంతా బహిరంగమే..



రోడ్డుపై బహిరంగంగా మద్యం తాగుతున్న యువకులు

ఏయూక్యాంపస్: మద్యం ఏరులై పారుతోంది. పట్టపగలు రహదారులే బార్లుగా మారిపోతున్నాయి. యువత పెడతోవ పడుతున్నారు. మద్యం షాపులు పెరిగిపోవడం, నిరంతరం మద్యం లభిస్తుండటంతో యువత విరివిగా తాగేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం పెద జాలరి పేట ప్రాంతంలో రోడ్డు పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌పై కూర్చుని తీరిగ్గా కొందరు యువకులు మద్యం తాగుతున్న దృశ్యమిది. పరిస్థితులు ఇలా ఉన్నాయంటే ఈ మార్గంలో మహిళలు, చిన్నారులు వెళ్లే పరిస్థితి ఉంటుందా అనే సందేహం అందరిలో కలుగుతోంది. పోలీసులు ఇటువంటి చర్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రపంచీకరణలో హిందీకి ప్రత్యేక స్థానం



ఆచార్య జయలక్ష్మిని సత్కరిస్తున్న అధ్యాపకులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో హిందీ భాష సంస్కృతి, పోకడలు అంశంపై బుధవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ద్వితీయ భాషా విభాగాధిపతి ఆచార్య పి.కె.జయలక్ష్మి ముఖ్య అతిథిగా జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందీ భాష అభివృద్ధి, ప్రపంచీకరణలో హిందీ పాత్ర, డిజిటల్ యుగంలో హిందీ వాడుకలో జరగనున్న మార్పులపై విద్యార్థులకు విశదీకరించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు జయలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.బోస్ పాల్గొన్నారు.

నేడు ఉక్కు రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ యథావిధిగా కొనసాగించాలన్న డిమాండ్‌పై గురువారం ధర్నా చేపట్టనున్నారు. స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం (వీఎస్‌పీఆర్ఈఏ), ఉక్కు అధికారుల సంఘం, అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు.

అప్రమత్తతే రక్ష

- వాతావరణంలో మార్పులతో వ్యాపిస్తున్న విష జ్వరాలు
- జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ప్రజలు
- ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి రోజూ 10 కేసుల నమోదు
- ఆందోళన వద్దు.. జాగ్రత్తలే మేలంటున్న వైద్యులు

మద్దిలపాలెం: వాతావరణం శీతలం నుంచి వేసవిలోకి ప్రవేశించడంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. దగ్గు, జలుబు, జ్వరాల బారిన పడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మరోవైపు వింత వ్యాధి నగరంలో ప్రబలిందనే ప్రచారం జోరుగా సాగడంతో చిన్న పాటి జ్వరం వచ్చినా జనం వణికిపోతున్నారు. దీంతో దగ్గరలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(యూపీహెచ్‌సీ)కు పరుగులు తీస్తున్నారు. వాతావరణంలో సంభవించే మార్పుల వల్ల వైరల్ జ్వరాలు వ్యాపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఇవి వయసుతో సంబంధం లేకుండా వ్యాప్తి చెందుతాయని, ఏ మాత్రం అజాగ్రత్తగా ఉండకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

ఈ వ్యాధులతో జాగ్రత్త..

ఎండ తీవ్రత పెరిగి అనేక రకాల వ్యాధులు విజృంభిస్తుండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ కాలంలో సాధారణంగా జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, ఫ్లూ వంటి వ్యాధులు సంభవిస్తాయి. వీటితోపాటు పలు రకాల అంటువ్యాధులు, కంటి వ్యాధులే కాకుండా ఎలర్జీలు, ఆస్తమా, సీవోడీపీ, అలర్జిక్ బ్రాంకైటిస్, నిమోనియా వంటి శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయి.

గొంతునొప్పి: చాలా మందిని ఇబ్బంది పెట్టే ప్రధాన సమస్యల్లో గొంతునొప్పి ఒకటి. సీజన్ మారే సమయంలో చాలా మందికి ముందుగా గొంతునొప్పి వస్తుంది. గొంతులో ఇన్‌ఫెక్షన్ కారక సూక్ష్మక్రిములు చేరడం వల్ల నొప్పి మొదలవుతుంది. గొంతులో గురకగా ఉంటుంది. ఎడతెరిపిలేని దగ్గు వేధిస్తుంది.

జలుబు: దగ్గుతోపాటు చిన్న పిల్లలు, పెద్దవారు అనే తేడా లేకుండా వచ్చే సీజనల్ జలుబు ప్రతి ఒక్కరిని చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది. ఈ కాలంలో మరి ముఖ్యంగా చిన్న పిల్లలు తరచుగా జలుబు, దగ్గుతో ఇబ్బంది పడుతుంటారు. కాస్త వాతావరణం మారినా, తాగే నీరులో మార్పు కనిపించినా పిల్లల్లో జలుబు లక్షణాలు పెరుగుతాయి.



వృద్ధులకు సూచనలిస్తున్న వైద్యాధికారి రెనీషా

జ్వరం: ఉష్ణోగ్రతల్లో తేడాల కారణంగా వైరల్ జ్వరాలు ఎక్కువగా వ్యాప్తిస్తాయి. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. ఈ కాలంలో కొన్ని అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నప్పటికీ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్ల ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు

జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట, 15వ వార్డు పాత వెంకోజీపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జ్వర పీడితులు క్యూ కడుతున్నారు. రోజుకు కనీసం 6 నుంచి 11 మంది వరకు జలుగు, దగ్గు, జ్వరంతో పీహెచ్‌సీకి వస్తున్నారు. వారికి తగిన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారులు చెబుతున్నారు.



పాత వెంకోజీపాలెం ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

తగు జాగ్రత్తలు తీసుకోవాలి



వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా విష జ్వరాలు ప్రబలుతున్నాయి. వీటి బారిన పడకుండా కొంచెం అప్రమత్తంగా ఉండాలి. శీతలం నుంచి ఉష్ణంలోకి వాతావరణం మారడం వల్ల పలు జ్వరాలు వస్తాయి. వాటికి భయపడాల్సిన అవసరం లేదు. సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో జ్వర పీడితులు పరీక్షలు చేసుకుని తగు వైద్యం తీసుకోవాలి.

– డాక్టర్ రెనీషా, వైద్యాధికారి, పాత వెంకోజీపాలెం యూపీహెచ్‌సీ

కదలని పారిశుధ్య వాహనాలు



ముడసర్లోవ వద్ద జీవీఎంసీ పారిశుధ్య వాహనాలు

ఆరిలోవ: జీవీఎంసీ జోన్–2 పరిధిలో పారిశుధ్య విభాగంలో చెత్త తరలించే కొన్ని వాహనాలు కొద్ది రోజులుగా నిలిచిపోయాయి. అధికారులకు వాటికి డీజిల్ వేయకపోవడంతో ముడసర్లోవ వద్ద మినీ సీవేజ్ ఫాం(ఎంఎస్ఎఫ్) ప్రాంగణం నుంచి కదలడం లేదు. దీంతో వార్డుల్లోని బహిరంగ ప్రదేశాల్లో చెత్త రోడ్డు పక్కన నిల్వ ఉండిపోతోంది. కాలువలు, గెడ్డల్లో తీసిన పూడికను టాటా ఏసీ వాహనాల(ఓపేన్ టాప్), టిప్పర్లలో డంపింగ్ యార్డుకు తరలిస్తారు. గెడ్డలు, కాలువల్లో పూడిక తీయడానికి జేసీబీలను ఉపయోగిస్తున్నారు. ఆయా వాహనాలు జోన్–2 పరిధిలో సుమారు 80కి పైగా ఉన్నాయి. వాటిలో సగానికి పైగా వాహనాలు రెండు వారాలుగా తిరగడం లేదు. వీధుల్లోకి రాకుండా ప్రాంగణానికే పరిమితమయ్యాయి. ఆరిలోవ, ఆదర్శనగర్, పెదగదిలి, చినగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెంతోపాటు మధురవాడ ప్రాంతాల్లో కూడా పలుచోట్ల కాలువల్లో పూడిక తీయడానికి జేసీబీలు అందుబాటులో లేవు. పారిశుధ్య కార్మికులు వీధులు శుభ్రం చేసి సేకరించిన చెత్త తరలించడానికి, వీధుల్లో చిన్న కాలువల నుంచి తొలగించిన పూడిక తరలించడానికి టాటా ఏసీ వాహనాలు అందుబాటులో లేవు. సుమారు రెండు వారాల నుంచి జీవీఎంసీ అధికారులు చెత్త తరలించే వాహనాలకు డీజిల్ వేయకుండా వదిలేసి పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు విమర్శిస్తూ.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏయూలో ముగిసిన వజ్రోత్సవాలు



వక్తలను సన్మానిస్తున్న నిర్వాహకులు



హాజరైన ఆచార్యులు, విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియోఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకలు బుధవారంతో ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సైంటిస్టులు భూగర్భ జలవనరుల వినియోగం, వాటిని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో పాల్గొన్న వక్తలను సన్మానించారు. జాతీయ సదస్సులో భాగంగా వర్సిటీ జియో ఫిజిక్స్ విభాగం భవనం ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వైజ్ఞానిక ప్రదర్శనను సైంటిస్టులు, ఆచార్యులు, విద్యార్థులు తిలకించారు. భూగర్భ గనుల శాఖ, ఇన్ కాయిస్, ఫిషరీస్ విభాగం, నగర పాలక సంస్థ తదితర ప్రభుత్వ శాఖలు ప్రత్యేకంగా ప్రదర్శన ఏర్పాటు చేశాయి. వేడుకలో భాగంగా 2024 సంవత్సరానికి డాక్టర్ హరినారాయన్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య కె.ఎస్.కృష్ణను నిర్వాహకులు ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సి.వి.నాయుడు, ఐజీయూ ప్రతినిధి డాక్టర్ ప్రసాద్, ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పేలవంగా ముగింపు..

ఇదిలా ఉండగా.. జియో ఫిజిక్స్ విభాగం వజ్రోత్సవాలకు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. వర్సిటీ వందేళ్ల ఉత్సవాలకు ముందు నిర్వహించే వేడుక కావడంతో దీనిలో మిగతా విభాగాల వారిని కూడా భాగస్వామ్యులను చేస్తే బాగుండేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముగింపు ఉత్సవాలకు ఏయూ వైస్ చాన్సలర్ లేకపోగా.. రిజిస్ట్రార్ సైతం పాల్గొనక పోవడంతో వజ్రోత్సవాలు పేలవంగా ముగిసినట్లయింది.

గణపతి ఆరాధనతో సర్వసిద్ధులు

ఎంవీపీకాలనీ: శ్రీ మహాగణపతి వైభవంపై బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు బుధవారం కొనసాగాయి. రుషి పీఠం సత్సంగం శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్క్ వేదికగా ఈ కార్యక్రమం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా షణ్ముఖశర్మ వేద, పురాణ, మంత్ర శాస్త్రాల సహిత శ్రీ మహా గణపతి వైభవాన్ని వివరించారు. గణపతి ఆరాధనతో సర్వసిద్ధులు లభిస్తాయన్నారు. సర్వ మంత్రాలకు మూలం ఓంకారమని పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నిర్వాహకులు కె.వి.ఎస్.శ్యామ్, కందాళ అరుణ గాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణ మూర్తి తదితరులు పర్యవేక్షించారు.

ఆచార్య ప్రసన్నశ్రీకి సత్కారం



ఆచార్య ప్రసన్నశ్రీని సత్కరిస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఎస్టీ ఆచార్యరాలు ప్రసన్నశ్రీని ప్రభుత్వం ఆదికవి నన్నయ వర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియమించడంపై అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం హర్షించింది. రాష్ట్రంలో తొలిసారి ఆదివాసీ మహిళను వీసీగా నియమించడంపై సంఘ ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ప్రసన్నశ్రీని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కలిసి సత్కరించారు. ఆదివాసీల అభ్యున్నతికి, గిరిజన తెగల ఉన్నత విద్యా బోధనకు ఆచార్య ప్రసన్నశ్రీ చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అనేక గిరిజన తెగల మాటలకు అనుగుణంగా భాష, లిపిని రూపొందించడం ఆమె సేవలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, పద్మరాజు, మధు, శేఖర్, ఆనంద్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు అడ్డుకట్ట



పెదగదిలి గెడ్డ అంచున అక్రమంగా వెలసిన బోర్డును తొలగిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు



ఆక్రమణకు గురైన స్థలంలో కంచె వేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: పశు సంవర్ధక శాఖ స్థలం ఆక్రమణకు ఆ శాఖ అధికారులు అడ్డుకట్ట వేశారు. ఆక్రమణను తొలగించి బుధవారం తాత్కాలిక కంచె ఏర్పాటు చేశారు. తోటగరువు ప్రాంతం ఎర్నిదుర్గమాంబ ఆలయం పక్కన పెదగదిలి గెడ్డను ఆనుకొని పశు సంవర్ధక శాఖకు చెందిన స్థలం ఆక్రమణకు గురైంది. ఇక్కడ సుమారు 1,000 చదరపు గజాలకు పైగా స్థలాన్ని కొందరు ఆక్రమించి శివాలయం పేరుతో షెడ్ నిర్మించేశారు. దానికి ఆలయం పేరు బోర్డుతో కూడిన ఆర్చి అమర్చారు. అంతటితో ఆగకుండా మరికొందరు ఈ స్థలాన్ని ఆనుకొని రోడ్డు పక్కన అక్రమంగా బడ్డీలు ఏర్పాటు చేశారు. దీనిపై పశు సంవర్ధక శాఖ అధికారులకు స్థానికులు పలుసార్లు ఫిర్యాదులు చేశారు. దీని గురించి కలెక్టర్‌కు సైతం ఫిర్యాదులు అందడం విశేషం. ఎట్టకేలకు పశు సంవర్ధక శాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగం అధికారులు స్పందించారు. బుధవారం ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నీలయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఆక్రమణకు గురైన స్థలానికి చేరుకుని పరిశీలించారు. శివాలయం బోర్డుతో కూడిన ఆర్చిని సిబ్బందిచే తొలగింపజేశారు. అనంతరం దాని చుట్టు తాత్కాలికంగా కంచె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీడీ నీలయ్య మాట్లాడుతూ ఇక్కడ స్థలం చుట్టూ రక్షణ గోడ మంజూరైందన్నారు. ఎమ్మెల్సీ కోడ్ ఉండటంతో నిర్మాణం ఇంకా ప్రారంభించలేదని, అందుకే తాత్కాలిక కంచె ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడ స్థలంలో రోడ్డు పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలను రెండు రోజుల్లో తొలగించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. పశు సంవర్ధక శాఖ స్థలాన్ని ఎవరు ఆక్రమించినా శిక్షార్హులని ఆయన హెచ్చరించారు.

వీసీల నియామకంలో వెలమ వర్గానికి అన్యాయం



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

ఏయూక్యాంపస్: రాష్ట్ర వ్యాప్తంగా ఉప కులపతుల నియామకంలో వెలమ సామాజిక వర్గాన్ని పూర్తిగా విస్మరించడం సరికాదని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. బీచ్ రోడ్డులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాజాగా రాష్ట్రంలో జరిపిన వైస్ చాన్సలర్ల నియామకంలో వెలమ సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పూర్తిగా వెలమ సామాజిక వర్గాన్ని పక్కన పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జనాభా దామాషా ప్రకారం వెలమ వర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెలలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో వెలమ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని, వెలమ సామాజిక వర్గాన్ని బీసీ–డీ నుంచి బీసీ–ఏ జాబితాలోకి మార్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ వెలమ సంఘం నాయకులు పెదిరెడ్ల సత్యం, వరుదు రాజ్‌కుమార్, రెడ్డి ఈశ్వరరావు, పెదిరెడ్ల శ్రీనివాస్, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా..?

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో పారిశుధ్య నిర్వహణ చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వర్సిటీ ప్రాంగణంలో వ్యర్థాలను ఏ రోజుకారోజు తొలగించకపోవడంతో పరిసరాలు కంపుకొడుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీలోని నాగార్జున హాస్టల్(బాలికల వసతి గృహం) సమీపంలో రోజూ ఇలాంటి దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. పరిసరాల్లో పోగు చేస్తున్న వ్యర్థాలను హాస్టల్‌కు సమీపంలో రోడ్డు పక్కన పడేస్తున్నారు. వీటిని రోజుల తరబడి అలానే వదిలేస్తుండటంతో ఆ దారిలో ముక్కు మూసుకొని ప్రయాణించాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. ఏయూ అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఏయూ బాలికల హాస్టల్ సమీపంలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

పుస్తక పఠనంతో మనో వికాసం

సీతంపేట : నేటి తరం విద్యార్థులు పుస్తకం చదవడం కన్నా, మొబైల్ ఫోన్ ద్వారా వారికి కావాల్సిన సమాచారాన్ని పొందటానికి ప్రయత్నం చేస్తున్నారని లంకపల్లి బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అన్నారు. బీకాం, బీబీఏ విద్యార్థులకు కేవలం పాఠ్య పుస్తకాలు చదవడం మాత్రమే కాకుండా, గ్రంథ సమీక్ష చేయడంలో కూడా శిక్షణ ఇచ్చే కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది మంది విద్యార్థులు వారికి సూచించిన గ్రంథాలను సమీక్షించి ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన గ్రంథ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పుస్తక పఠనం, సమీక్ష చేయడం మనో వికాసానికి దోహదపడతాయన్నారు. కళాశాల విద్యార్థులు త్రయానా, ఉషశ్రీ, ప్రణీత, ఇనయత్ ఆలీ, శ్రేయ, బి.తనూష, రమ్య, రాథోడ్, ఆమీర్ రౌత్రే గ్రంథ సమీక్ష చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, దీపక్ చౌదరి, సోమేశ్వరరెడ్డి, అధ్యాపకులు రియాజ్ మొహమ్మద్, రంగనాయకులు, బి.శ్రీనివాసరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తక సమీక్ష చేసిన విద్యార్థులతో బుల్లయ్య కళాశాల సెక్రటరీ మధుకుమార్

ఆశ్రమ విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులోని శ్రీ శాంతి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం డియర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి, స్టేషనరీ ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధినేత రంజిత్‌కుమార్ మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాల్లో పాల్గోవాలని, తోటివారికి సాయపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డియర్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ దేవి, పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మురళీనగర్: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ కీర్తి పట్నాయక్ అధ్యక్షతన మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉన్నత లక్ష్యాల సాధన అనే అంశంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు పరీక్షలకు భయపడకూడదని, ఇష్టంతో కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. పెద్దలను గౌరవించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని చెప్పారు. మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో యువతీ యువకులు ప్రేమ, వ్యామోహంలో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. సోషల్ మీడియా పరిచయాలు మానుకోవాలని, జీవితంలో స్థిరపడేందుకు మంచిగా చదువుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. సైబర్ నేరాల పట్ల యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు, మహిళలు ఆపద సమయంలో 112 నంబరుకు డయల్ చేయడం లేదా, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ ఏఆర్ పృథ్వితేజ, కంచరపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్, హెచ్ఎం బి.హేమలత, సీడీపీవో రామకుమారి, చింతాడ అచ్యుతరామారావు, సనపల వరప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: గంజాయి అక్రమంగా తరలిస్తున్న నిందితులను విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని, 8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్‌పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హర్యానా రాష్ట్రం, హిస్సార్ జిల్లాకు చెందిన బబ్లు సప్రియ విశాఖపట్నం స్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. 8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

మరో కేసులో 12 కేజీల గంజాయి సీజ్

రైల్వేస్టేషన్‌లో మరో కేసులో జీఆర్పీ ఎస్ఐ ఎస్‌కే మారూఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ జేటీ నాయుడు కలిసి ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాకు చెందిన ధనర్జయ పాంగిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 12 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.

ప్రాచీన సాహిత్యంలో ఆధునిక పోకడలు

సీతంపేట: ప్రాచీన సాహిత్యమైనా, ఆధునిక సాహిత్యమైనా ప్రజాక్షేమం కోసం సాగితే ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఆచార్య కొచ్చర్లకోట వెంకట సత్యనారాయణమూర్తి అన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజమ్ కళాశాలలో 'ప్రాచీన సాహిత్యంలో ఆధునిక పోకడలు' అనే అంశంపై నిర్వహించిన సాహిత్య ప్రసంగంలో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. ప్రపంచ సాహిత్యం మొదలుకుని, భారతీయ తెలుగు ప్రాచీన ఆధునిక సాహిత్యాలపై అవగాహన కల్పించారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రమాద బీమా



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

డాబాగార్డెన్స్: ఏపీఎస్ఆర్‌టీసీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.10లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తూ ఆర్టీసీ యాజమాన్యం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు పోస్టల్ అధికారులు, పర్సనల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అన్ని డిపో అధికారులతో తన చాంబర్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అద్దె బస్సుల డ్రైవర్లు, పొరుగు సేవల డ్రైవర్లు, బస్సు అటెండర్లు, బస్టాండ్, గ్యారేజ్, ఆర్టీసీ కార్యాలయాల్లో పని చేసే ఔట్‌సోర్సింగ్ స్వీపర్లు, ట్రాఫిక్ గైడ్లు, కౌంటర్లలో టికెట్స్ బుక్ చేసే సిబ్బంది, ఇతర ఉద్యోగులందరికీ ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. పోస్టల్ శాఖ అంత్యోదయ గ్రామిక్ సురక్ష యోజన కింద ఈ బీమా అమలు చేయనున్నట్లు తెలిపారు.